క్లుప్తంగా

ఎంపీడీఓ జానయ్యకు వినతి



కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌లో మూడు నెలలుగా ఉపాధిహామీ కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు గోపాల్, సీఐటీయూ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులను తక్షణమే అందించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, రోజు కూలీ తమకు ఎంత వస్తున్నాయే అధికారులు తెలుపడం లేదని ఆరోపించారు. అనంతరం ఎంపీడీఓ జానయ్య, ఎపీఓ చంద్రశేఖర్ కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని వారు అందించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని బాగుచేయండి



మరికల్: మండల కేంద్రంలోని హన్‌మాన్‌వాడ రహదారిని పూర్తిగా మరమ్మతులు చేయడంలో గత ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారు. రహదారి రెండు వైపుల సీసీరోడ్డు వేసి మధ్యలో దాదాపు 50అడుగల సీసీరోడ్డు వేయకపోవడంతో డ్రెయినేజీ నీరు చేరి అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పనిచేసిన పాలకులు అసంపూర్తిగా రోడ్డు పనులు చేసి వదిలేయడంతో డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి చేరి దారుణంగా తయారైందన్నారు. అధికారులు స్పందించి మిగిలిన రోడ్డును సీసీరోడ్డుగా మార్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర రాజముద్ర మార్చొద్దు..



ఊట్కూరు: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో చార్మినార్‌తో పాటు కాకతీయుల తోరణాన్ని తొలగించొద్దని, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా సమన్వయకర్త మహేష్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని బిజ్వార్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం రాష్ట్ర రాజముద్రికలో మార్పులు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ఎప్పుడు ప్రజల అమోదయోగ్యంగా ఉండాలే తప్ప ప్రజా వ్యతిరేకంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నర్సింహ, రాజు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం



మక్తల్: పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, రవిపంక్షన్ హాల్ అధినేత వట్టం రతన్‌కుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు అర్చకులు వట్టం రతన్‌కుమార్ దంపతులను శాలువాతో సన్మానం చేశారు. అధ్యక్షుడు అంబాదాస్‌రావు, డాక్టర్ శ్రీరాం, అనుగొండ శ్రీనివాసులు, సత్య అంజనేయులు, సిద్దలింగప్ప పాల్గొన్నారు.

కండక్టర్‌కు సన్మానం

పేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేసిన మక్తల్‌కు చెందిన కండక్టర్ ప్రభాకర్ శుక్రవారం పదవీ రమణ పొందుతున్న సందర్భంగా వా రిని శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. అనంతరం ఆర్టీసీ ఉన్నత అధికారులు మాట్లాడుతూ.. సమాజంలో మంచి సేవలు చేసేవా రికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని అన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం: కేసునమోదు

కోస్గి: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ తల్లి తన ఏడాదిన్నర కొడుకుతో కలిసి అదృశ్యమైన సంఘటనపై కేసునమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. బాధితుల, పోలీసుల కథనం మేరకు.. గుండుమాల్ మండల కేంద్రానికి చెందిన చంద్రకళ (24) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఈ నెల 29తన ఏడాదిన్నర కొడుకును తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధవుల వద్ద వెతికిన అచూకి లభించలేదు. దీంతో చంద్రకళ తల్లి చెన్నమ్మ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొరవడిన అవగాహన

- అటకెక్కిన 'మన తెలంగాణ – మన వ్యవసాయం'
- రైతు వేదికల్లో తూతూమంత్రంగా సదస్సులు
- వానాకాలం సాగు సీజన్ ముంచుకొస్తున్నా స్పందించని అధికారులు



మద్దూరులో విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

మద్దూరు: వానాకాలం సాగు సీజన్ ముంచుకొస్తోంది. ఇప్పటికే చేలు దున్ని.. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తొలకరి వానల కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి తరుణంలో పంటల సాగుపై రైతులకు సలహాలు, సూచనలు కరువయ్యాయి. రైతు చైతన్య యాత్రలు గత కొన్నేళ్లుగా నిర్వహించకపోవడంతో సాగుపై రైతన్నలకు అవగాహన కొరవడింది. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, ఏయే పంటలు వేయాలనే వాటిపై అవగాహన కల్పించకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు వ్యవసాయశాఖ అధికారులు మాత్రం రైతువేదికల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో మాత్రం అలసత్వం కనిపిస్తోంది. చాలాచోట్ల రైతు వేదికలు ఊరికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి.

అవగాహన కల్పిస్తే మేలు..

రైతులు అధిక దిగుబడి పొందడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు వ్యవసాయ శాఖ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా వానాకాలంలో మన తెలంగాణ– మన వ్యవసాయం, రైతు చైతన్య యాత్ర పేరిట గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసేవారు. కానీ కొన్నేళ్లుగా వీటిపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఏ పంట వేసుకోవాలనే విషయాలు తెలియక రైతులు మూస పద్ధతిలో వరి, పత్తి, జొన్న, పెసర, కంది ఇతర పంటలు సాగు చేస్తున్నారు. కాలం చెల్లిన పద్ధతులు, మారిన వాతావరణ పరిస్థితులతో ఇటీవలకాలంలో తెగుళ్ల బెడదతో పత్తి, వరి, ఇతర పంటల్లో రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి భూసార పరీక్షల అవశ్యకత, పంటల మార్పిడి, పంటలను ఆశించే చీడపీడల నివారణ, సాగులో నష్టపోయినప్పుడు పాడి పశువుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడం, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలు, విత్తనోత్పత్తికి సంబంధించిన తదితర విషయాలపై అవగాన కలిగించాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా రైతు వేదికలు..

మండలంలోని ఎనిమిది క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించారు. చాలా చోట్ల ఊరికి దూరంగా ఉండడంతో రైతు వేదికలు నిరుపయోగంగా మారాయనే విమర్శలు వస్తున్నాయి. చాలా చోట్ల రైతువేదికల వద్దకు ఏఈఓలే వెళ్లడం లేదనేది ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ రైతులకు కావాల్సిన సలహాలు, సూచలను ఏ సీజన్‌లో ఏ పంటలు వేసుకోవాలి, తదితర విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ వేదికలు నిరుపయోగంగా మారాయి. క్లస్టర్ల పరిధిలోని గ్రామాల రైతులు ఇక్కడి వచ్చిన దాఖాలు కనిపించడం లేదు.

నాలుగు మండలాలకు ఒక్కరే..

సీఎం సొంత నియోజకవర్గంలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాలకు కలిపి ఒక్క వ్యవసాయాధికారి మాత్రమే ఉన్నారు. గత 8 నెలలుగా మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలకు ఇన్‌చార్జి ఏఓ వ్యవహరిస్తున్నాడు. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో కూడా ఈ మండలాల్లో నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వానాకాలం సీజన్ ప్రారంభమైవుతున్న నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోళ్లపై గ్రామాల్లో ఏఈఓలచే అవగాహన కల్పిస్తున్నాం. అలాగే విత్తనాల షాపుల వద్ద కూడా సూచనలు చేస్తున్నాం. గతంలో మాదిరిగా రైతు చైతన్య సదస్సులు మాత్రం నిర్వహించడం లేదు.

– రామకృష్ణ, ఏఓ, మద్దూరు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రామకృష్ణ

మద్దూరు: మండలంలోని ఎక్కడైన నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎస్ఐ రాంలాల్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మద్దూరు, కొత్తపల్లి ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఏఓ మాట్లాడుతూ.. డీలర్లు విక్రయించిన విత్తనాల వివరాలు రైతు వారీగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, సీడ్, ఫర్టిలైజర్స్ స్టాక్ వివరాలు రోజువారీగా అప్‌డేట్ చేసి, బోర్డుపై ప్రదర్శించాలని, రైతులు వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు విత్తనాలకు సంబంధించిన రసీదు, ప్యాకింగ్ బ్యాగ్ తప్పనిసరిగ్గా పంటకాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్, సీడ్స్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను చాటుకోవాలి



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శెట్టి వెంకటేష్ తదితరులు

దామరగిద్ద: వేసవి క్రీడా శిబిరంలో నేర్చుకున్న మెలకువలతో క్రీడా ప్రతిభను చాటుకోవాలని జిల్లా యువజన క్రీడా అధికారి శెట్టి వెంకటేష్, పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ నర్సింహులు, అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఈటీ వెంకటప్ప ఆధ్వర్యంలో గత నెలరోజులపాటు నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం ముగింపు సందర్భంగా వారు హాజరై విద్యార్థులకు ఖోఖో ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ట్రోఫీని అందజేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడారు.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా నైపుణ్యాల ను పెంపొందించుకోవాలని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలో రాణించి మంచిపేరు సంపాదించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చక్రవర్తి, నవీన్, పీఈటీ వెంకటప్ప విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక సేవపై దృష్టిసారించాలి



బట్టి కృష్ణయ్యను సన్మానిస్తున్న నాయకులు, టీచర్లు

నారాయణపేట రూరల్: ఉద్యోగ విరమణ తర్వాత శేష జీవితాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు కేటాయించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బైరంకొండ యూపీఎస్ స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన బట్టి కృష్ణయ్య, శశికళ దంపతులను అశోక్‌నగర్‌లోని వారి నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితానికి మాత్రమే విరమణ తీసుకున్నారని, భవిష్యత్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సంఘం పటిష్టతకు సహకారం అందించాలన్నారు. తాను పనిచేసిన శేర్నపల్లి, నిడుగుర్తి, పేరపళ్లతండా, బైరంకొండ, పంచలింగాలలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ, నరేష్, అరవింద్, అశోక్, గోపాలకృష్ణ, వెంకటేష్, శేషప్ప, సుదర్శన్, హిమాన్ష్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే



నారాయణపేట రూరల్ : హైదరాబాద్‌లోని వేర్వేరు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తలను శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పరామర్శించారు. మండలంలోని పేరపళ్లకు చెందిన అరుణ్ కిడ్నీ సంబంధ వ్యాధితో గత కొంత కాలంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను పరామర్శించి, వైద్యులతో ఆయన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దామరగిద్దకు చెందిన సుజాత, చిన్నారి పాపను పరామర్శించి, వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లుకు సూచించారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



మాగనూర్: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు రోడ్లు ఏర్పాటు చేయడం, గ్రామాలకు మట్టి రోడ్లు ఏర్పాటు, ఫాంపాండ్ పనులు, మట్టిని తొలగించడం, కాల్వలు ఏర్పాటు చేయడం తదితర పనులు శుక్రవారం మండలంలో జోరుగా సాగుతున్నాయి. వేసవికాలం పనులు లేని సమయంలో కూలీలు ఉపాధిహామీ పథకం కింద పనిచేస్తున్నారని ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ తెలిపారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉదయం 7 గంటల నుంచి 10:30 గంటల వరకు పనులు జరుగుతున్నాయన్నారు. కూలీలు ఉదయం ఇంకా కొంచెం ముందుగా వచ్చి పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అదనపు పీడీ అంజప్ప

మరికల్: ప్రభుత్వ సహకారంతో మహిళ సంఘాలు అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ అంజప్ప అన్నారు. మండలంలోని మహిళ సంఘాల సభ్యులు తయారు చేస్తున్న రొట్టెల తయారి పద్ధతిని శుక్రవారం ఆయన పరిశీలించారు. రొట్టెల తయారిచేసి విక్రయిస్తే లాభాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మహిళ సంఘాల రుణాలతో వివిధ వ్యాపారాలతో అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి జయన్న, ఏపీఎం చెన్నప్ప పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై మండల సభ



మండల సభలో పాల్గొన్న అధికారులు

ఊట్కూరు: ఉపాధిహామీ పథకంలో వారం రోజులుగా చేపట్టిన సామాజిక తనిఖీపై శుక్రవారం మండల పరిషత్ భవనంలో మండల సభ నిర్వహించారు. గతఏడాది రూ. 5కోట్ల 49 లక్షల పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలోని పులిమామిడి, బిజ్వార్, చిన్నపొర్ల తదితర గ్రామాల్లో చేపట్టిన సామాజిక తనిఖీపై చర్చించారు. డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, అధికారులు నాగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొగాకును పూర్తిస్థాయిలో నిర్మూలిద్దాం



మక్తల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తలు తదితరులు

మక్తల్: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవ ర్యాలీని శుక్రవారం పట్టణంలోని కర్ని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. ప్రజలు పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. పొగాకుతో ప్రాణంతకమైన క్యాన్సర్ వ్యాపిస్తుందన్నారు. పొగాకు యొక్క హానికరమైన కారకాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హబీబ్, విరోజ, సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

నర్వ: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవ ర్యాలీని శుక్రవారం మండలంలోని వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరుకుని అక్కడ వైద్యులు డా. వెంకటరమణ మాట్లాడారు. పొగాకు తీసుకోవడంతో కలిగే నష్టాలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ప్రభాకర్‌జెట్టి, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, ఫార్మసిస్టు శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు చంద్రకళ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండ వైద్యాధికారిణి నాగజ్యోతి మాట్లాడుతూ.. పొగాకు తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధులపై వివరించారు. తీసుకునే ఆహార అలవాట్ల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: పొగాకు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాడం కీర్తి అన్నారు. శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని ర్యాలీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పొగాకు తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధులపై వివరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనురాధ, కథలప్ప, సునిత, సుమలత, రాణి, వరలక్ష్మి, పద్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



నర్వలో



ధన్వాడలో..

హయ్యర్ పెన్షన్ డిమాండ్ డ్రాఫ్ట్‌పై అలసత్వం వద్దు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన హయ్యర్ డిమాండ్ డ్రాఫ్ట్ విషయంలో అలసత్వంగా ఉండొద్దని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అహ్మద్‌ఖాన్ సూచించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. డిమాండ్ నోటీస్ మే 20న వస్తే 70రోజులు, మే 30న వస్తే 61రోజుల సమయం ఉంటుందని తెలిపారు. ఎంప్లాయిర్, ఎంప్లాయి ఖాతాల నుంచి పంపిస్తున్నా కారణంగా 99.5శాతం డబ్బులు కట్టాల్సిన అవసరం లేదన్నారు. డిమాండ్ నోటీసు వచ్చిన వెంటనే డిపోల వారిగా లిస్ట్ పంపించినా కొన్నిచోట్ల అధికారుల నిర్లక్ష్యంతో సమాచారం అందించడంలేదని వాపోయారు. కార్మికులు తమకు డిమాండ్ నోటీసు రాకపోతే డిపోలో సంప్రదించాలని, ఇంటర్‌నెట్‌లో యూఎన్ఓ నంబర్‌తో చెక్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. కార్మికులు ఇచ్చిన కాపీలను డిపో అధికారులు 7రోజుల లోపు బస్‌భవన్‌కు పంపించాలన్నారు.

నల్ల చెరువు అలుగు పనులు ప్రారంభం

- ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ. లక్షా 50వేలు విరాళం



నల్లచెరువు అలుగు పనులు చేస్తున్న దృశ్యం

మక్తల్: మండలంలోని చిట్యాల గ్రామ సమీపంలో నల్లచెరువు అలుగు పూర్తిగా దెబ్బతిని పాడైందని గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపిన పట్టించుకోకపోవడంతో శుక్రవారం గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ. లక్షా 50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం అలుగు పనులను గ్రామ సర్పంచ్ జానకి భర్త లక్ష్మణ్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. అనంతరం విరాళం అందజేసినవారికి సర్పంచ్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతంతో టీస్టాల్ దగ్ధం



వివరాలు సేకరిస్తున్న ఆర్ఐ

నర్వ: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుదాఘాతంతో టీస్టాల్ దగ్ధమైంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. లంకాల్ చెందిన ఎస్.అనిల్ ఇటీవల టీస్టాల్‌ను తాత్కాలికంగా షెడ్ వేసుకోని జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం రాత్రి 9 గంటల వరకు విక్రయాలు ముగించుకుని స్వగ్రామానికి వెళ్లాడు. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు షాక్‌సర్క్యూట్ అయ్యి రెండు ఫ్రిజ్‌లు, కుర్చీలు, టేబుల్‌లు, కౌంటర్, వంట సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకొద్దామనుకున్న లోపల సిలిండర్‌లు ఉండడంతో అవి పేలుతాయోమనని సాహసం చేయలేకపోయారు. వెంటనే పెద్దశబ్దంతో రెండు సిలిండర్‌లు పేలి లోపల ఉన్న బండరాయి ముక్కలు ఎగిరిపడి చుట్టుపక్కల ఉన్న ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. పక్కనే ఉన్న బైక్ మెకానిక్ షెడ్ వద్ద ఆపి ఉన్న బైక్ సగం కాలిపోయింది. శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని ఎస్ఐ కురుమయ్య సందర్శించారు. అనంతరం ఆర్ఐ కృష్ణారెడ్డి సందర్శించి పంచనామ నిర్వహించి ప్రాథమికంగా రూ.3.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు నివేదిక ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

దాతలసాయం

ఘటనపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌రెడ్డి రూ.10 వేలు, బీఆర్ఎస్ నాయకుడు దండు అయ్యప్ప రూ.10 వేలు, లంకాల్ శ్రీకాంత్‌రెడ్డి రూ.10వేలు, నరేష్ రూ.10 వేలు బాధితుడికి అందించారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి



కిష్టంపల్లిలో మొక్కలకు నీటిని అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

అమరచింత: గ్రామాల్లో హరితహారం ద్వారా నాటిన మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. చెట్టుచెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టంపల్లి, సింగంపేటలో ఎంపీడీఓ మొక్కలకు నీటిని అందించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ద్వారా మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలతో పాటు ప్రార్థన మందిరాలు, ఆలయాలు, పాఠశాలల ఆవరణంలో నాటిన మొక్కలు వాడుముఖం పట్టకుండా రోజువారి నీటిని అందిస్తున్నామని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

గండీడ్: మండల పరిధిలోని అయా గ్రామాల్లో మృతి చెందిన పలువురి అంత్యక్రియలకు ఆయా పార్టీల వారు, చిన్ననాటి మిత్రులు ఆర్థిక సహాయం అందించారు. లింగాయిపల్లిలో తేనెటీగల దాడిలో జీడి వెంకట్‌రాములు మృతి చెందాడు. దీంతో శుక్రవారం కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులతో పాటు చిన్ననాటి స్నేహితులు, ముదిరాజ్ సంఘం, మత్స్యసహకార సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలకు సాయం అందించారు. అదేవిధంగా వెన్నాచేడ్‌లో తంగి అంజిలమ్మ మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం కాంగ్రెస్‌నాయులు ఆర్థికసాయం చేశారు. అదేగ్రామంలో పక్కిరి రాజు మృతిచెందగా అంత్యక్రియల నిమిత్తం అంబేడ్కర్ యువజనసంఘం, స్థానికులు ఆర్థికసాయం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, గోపాల్, వెంకటయ్య, పుల్లారెడ్డి, బీజేపీ నాయకులు బాల్‌రాజ్ , బాలయ్య ఉన్నారు.